ప్రత్యేక చట్టం తీసుకురావాలి



దేశ వ్యాప్తంగా వైద్యుల భద్రతకు ఆరోగ్యశాఖ ఓ ప్రత్యేక చట్టం తీసుకురావాలి. వైద్యుల సలహాలు, సూచనలు కూడా పరిగణనలోకి తీసుకోవాలి. కోల్‌కతాలో వైద్యురాలిపై చేసిన హత్యాచారం దారుణం. ఇటువంటి దాడులకు పాల్పడే వారికి అత్యంత తీవ్రమైన శిక్షలు విధించేలా కఠిన చట్టాలను రూపొందించాలి.

– ఎస్.కీర్తిరెడ్డి, సివిల్ అసిస్టెంట్ సర్జన్, బూచవరం ప్రభుత్వాసుపత్రి, జగ్గయ్యపేట



క్షేత్రస్థాయి నుంచే సమస్యలు తెలుసుకోవాలి



వైద్యశాలల్లో క్షేత్రస్థాయి నుంచే సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. 24 గంటల పాటు వైద్యశాలల్లో మహిళా వైద్యులే ఎక్కువ పని చేస్తున్నారు. వారికి రక్షణ కల్పించాల్సిన విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. కొందరికి చెప్పుకోలేని బాధలు కూడా ఎన్నో ఉంటాయి.

–వల్లూరిపల్లి నాగలక్ష్మి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, పీహెచ్‌సీ, బూచవరం

క్లుప్తంగా

నేటి 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక' రద్దు

కంచికచర్ల: మండల పరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కలెక్టర్ ఆదేశాల మేరకు రద్దు చేసినట్లు ఎంపీడీఓ కె.శిల్ప ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం శ్రీ కృష్ణాష్టమి పండుగ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలకు సెలవుకావడంతో రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

116 మందికి నేత్ర పరీక్షలు



వత్సవాయి: కొమరగిరి ట్రస్ట్, పిన్నమనేని సిద్ధార్థ కంటి వైద్యశాల సంయుక్త ఆధ్వర్యాన ఆదివారం వత్సవాయిలోని శ్రీ వెంకటేశ్వర హైస్కూల్ ఆవరణలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరంలో 116 మందికి ఉచిత కంటి పరీక్షలు చేశారు. డాక్టర్లు నజియా, ఫరూద్దీన్ పరీక్షలు చేసి వారికి అవసరమైన మందులను అందించారు. 116 మందిలో 19 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వెంటనే వీరిని ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వాహనంలో తరలించారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ కొమరగిరి రవీంద్రభరద్వాజ్, వైద్యశాల పీఆర్వో రాఘవ, నెల్లూరి రవి పాల్గొన్నారు.

ప్రజాశాంతికి విఘాతం కలిగిస్తే చర్యలు



కంచికచర్ల: ప్రజాశాంతికి విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ బోనగిరి రాజు హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సిలింగ్ ఇచ్చారు. ఎస్ఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, నేరాలకు పాల్పడొద్దని చెప్పారు. సత్ప్రవర్తన కలిగి ఉంటే రౌడీషీట్ తొలగిస్తామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే రౌడీషీటర్లపై పీడీ యాక్టు ప్రయోగిస్తామని హెచ్చరించారు.

నందిగామ టౌన్: రౌడీషీటర్లు నేర ప్రవృతిని మానుకుని ప్రశాంత జీవనం సాగించాలని సీఐ వైవీఎల్ నాయుడు పేర్కొన్నారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లపై ఎప్పటికప్పుడు నిఘా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం అరుణోదయ కళా సమితికి చెందిన శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై మంజూష శిష్య బృందం పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్య ప్రదర్శన ఇచ్చారు. నృత్య ప్రదర్శన ఇచ్చిన చిన్నారులను పలువురు భక్తులు అభినందించారు. అనంతరం ఆలయ అధికారులు మంజూష శిష్య బృందానికి అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు. సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం గోరకవి సంపత్‌కుమార్‌చే నారాయణ తీర్థుల తరంగాల గానం నిర్వహించారు.

గణనీయంగా తగ్గిన వరిసాగు

- మారుతున్న వాతావరణ పరిస్థితులు
- చెరువులు, బావుల కిందే సాగు
- సాగర్ జలాలే ప్రధాన సాగునీరు
- మూడోవంతుకు పడిపోయిన సాగువిస్తీర్ణం



చిట్టేలలో ఖాళీగా దర్శనమిస్తున్న సాగర్ కాలువ ఆయకట్టు భూములు

వత్సవాయి : వరిసాగు రైతులు ఏటా ఆటుపోట్లను ఎదుర్కొంటున్నారు. ఏటా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వరిసాగును చేయాలంటే రైతులకు ఇబ్బందిగా మారుతోంది. వరిసాగుకు ముఖ్యంగా సాగునీటి కొరత ప్రధాన సమస్యగా నెలకొంది. దీంతో రైతులు ప్రత్యామ్నాయ పంటలవైపు దృష్టిసారిస్తున్నారు. దీంతో క్రమేణా వరిసాగు తగ్గుముఖం పడుతోంది. వరిసాగు తగ్గడానికి ప్రధాన కారణం సరిపడిన మేర సాగర్‌జలాలు రాకపోతుండటంతోపాటు వర్షాభావ పరిస్థితులేనని రైతులు చెబుతున్నారు.

చెరువులు, బావుల కిందే వరిసాగు..

వత్సవాయి మండలంలో వరిసాగు ఎక్కువగా సాగర్ ఆయకట్టుపైనే ఆధారపడి ఉంది. సాగర్ కాలువ వస్తే పుష్కలంగా నాట్లు పడతాయి. గతంలో సాగర్‌నీటిని ప్రణాళికబద్ధంగా విడుదల చేసేవారు. కాని మారిన పరిస్థితుల నేపథ్యంలో సాగర్ జలాలు సక్రమంగా విడుదల జరగకపోతుండటంతో వరిసాగు గణనీయంగా తగ్గింది. దీంతో ప్రస్తుతం చెరువులు, బావులు, బోర్లు వసతి ఉన్న పొలాల్లో మాత్రమే వరినాట్లు వేస్తున్నారు. ప్రస్తుతం సాగర్ నీరు కూడా వస్తుండటంతో సాగర్ ఆయకట్టు కింద కూడా అక్కడక్కడా వరిసాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. అదేవిధంగా మునేటికి ఎగువన ఉన్న వరంగల్, ఖమ్మం జిల్లాల్లో వర్షాలు అధికంగా కురిసినప్పుడు మునేటికి వరద వస్తుంది. ఆ సమయంలో మునేటి కాలువకు నీటిని వదిలితే ఆయకట్టు కింద పొలాల్లో కొంతమేర నాట్లు పడతాయి.

పెరిగిన సాగువ్యయం..

వరిపంటకు గతంలో ఎన్నడూ లేనివిధంగా పెట్టుబడులు విపరీతంగా పెరిగిపోయాయి. ఎకరం వరి పంట సాగుచేయాలంటే కౌలుతో కలుపుకుని రూ.25 వేల వరకు ఖర్చవుతోంది. ఎకరం పొలం కౌలుకు తీసుకుంటే పది బస్తాల ధాన్యం రైతుకు ఇవ్వాల్సి ఉంది. మందుకట్టలు, పురుగు మందులు, కూలీలు, ట్రాక్టర్ ఖర్చులు కలుపుకుంటే మరో రూ.15వేల వరకు పెట్టుబడి అవుతుంది. ఎకరానికి 30 బస్తాల పైన దిగుబడి రావడంతోపాటు ధాన్యం బస్తా రూ.2వేలు అమ్మితేనే గిట్టుబాటు అవుతుందని, లేనిపక్షంలో నష్టాలే మిగులుతాయని వరిసాగు రైతులు చెబుతున్నారు.

గతేడాది 2,195 హెక్టార్లలో సాగు..

గతేడాది జగ్గయ్యపేట నియోజకవర్గంలోని మూడు మండలాల్లో కలిపి మొత్తం గతేడాది 2,195 హెక్టార్లలో మాత్రమే వరిసాగు చేపట్టారు. సాగర్ ఆయకట్టు విస్తీర్ణం ఆరు వేల హెక్టార్లు ఉండగా, సాగర్ నీటి విడుదల అరకొరగా ఉంటుండటంతో కొన్నేళ్లుగా సాగు విస్తీర్ణం తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం వరిసాగు విస్తీర్ణం ఆరు వేల హెక్టార్ల నుంచి అందులో మూడోవంతు రెండు వేల హెక్టార్లకు పడిపోయిందని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది వరిసాగు విస్తీర్ణం లెక్కలు మరోనెలరోజులకు కాని ఓ కొలిక్కిరావు. పెట్టుబడులు పెరగడం, పుష్కలంగా నీరు అందుబాటులో లేనందున సాగువిస్తీర్ణం పెరిగే అవకాశాలు లేవని రైతులు భావిస్తున్నారు. సాగు తగ్గడానికి ప్రధాన సమస్య సాగునీరు లేకపోవడమే. సాగర్ కాలువవచ్చి సకాలంలో వర్షాలు సమృద్ధిగా పడితేనే వరిసాగు ముందుకు సాగుతుంది. లేనిపక్షంలో వరిసాగుకు కష్టకాలం తప్పదు.

నీరు లేకనే సాగు తగ్గింది



వరిసాగుకు నీరు పుష్కలంగా ఉండాలి. సాగర్ కాలువకు నీరు పుష్కలంగా వస్తేనే వరిసాగు బాగుంటుంది. లేనిపక్షంలో రైతులకు కష్టాలు తప్పవు. బావులు, బోర్ల కింద ఉన్న పొలాల్లో మాత్రమే సాగుచేసే పరిస్థితులు నెలకొన్నాయి.

– సీహెచ్ కృష్ణారావు, ఇందుగపల్లి

సాగర్ జలాలు వస్తేనే వరి సాగు



వరిపంటకు నీరు అధికంగా అవసరం. నీరు పుష్కలంగా ఉంటేనే పంటకు చీడపీడలు కూడా ఆశించవు. ఆశించిన మేర దిగుబడులు రాకపోతుండటంతో రెండుమూడేళ్లుగా వరిసాగుపై రైతుల్లో ఆసక్తి తగ్గి సాగు విస్తీర్ణంగా ఏటా పడిపోతోంది. ప్రస్తుతం సాగర్‌కాలువ నీరు కూడా వస్తుండటంతో ఈ ఏడాది రైతులు వరిపంటను సాగుచేసే యత్నంలో ఉన్నారు.

– ఎం.పాపిరెడ్డి, చిట్టేల

మానవ మృగాలను కఠినంగా శిక్షించాలి

–ఎమ్మెల్యే తాతయ్య



జగ్గయ్యపేట అర్బన్: కోల్‌కతాలో పీజీ విద్యార్థిపై అత్యాచారం, హత్య ఘటనలో మానవ మృగాలను కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) డిమాండ్ చేశారు. హత్యాచార ఘటనను నిరసిస్తూ ఆదివారం సాయంత్రం పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో స్థానిక ఎన్డీఏ కూటమి నాయకులు, మహిళలతో కలసి ఎమ్మెల్యే తాతయ్య కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 78 ఏళ్ల స్వతంత్ర భారతంలో ఇలాంటి సంఘటనలు సిగ్గుచేటన్నారు. ప్రతి ఒక్కరూ స్పందించి నిందితులను కఠినంగా శిక్షించే వరకు నిరసనలు తెలపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

నేడు భగవద్గీత శ్లోక పఠన పోటీలు

మైలవరం: కృష్ణాష్టమి సందర్భంగా విద్యార్థులకు భగవద్గీత శ్లోక పఠన పోటీలు సోమవారం నిర్వహిస్తామని లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం అధ్యక్షుడు శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. మైలవరంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. విజేతలకు బహుమతి ప్రదానం జరుగుతుందని చెప్పారు.

కంచికచర్ల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడిగా నాగరాజు



కంచికచర్ల ఆర్యవైశ్య సంఘ నూతన కమిటీని ఎన్నుకున్న జిల్లా సంఘ నాయకులు

కంచికచర్ల: ఆర్యవైశ్య సంఘ కంచికచర్ల కమిటీని ఎన్నుకున్నారు. వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్యుల సంఘ సమీక్ష సమావేశం జరిగిందని జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు బొగ్గవరపు వెంకట రాజారావు ఆదివారం తెలిపారు. ముందుగా ఆలయంలో కొలువైఉన్న అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆర్యవైశ్య సంఘ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కంచికచర్ల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడిగా కొప్పు నాగరాజు, ప్రధాన కార్యదర్శి జూలూరి శ్రీనివాసరావు, కోశాధికారి పెరుమాళ్ల యశ్వంత్‌ను ఎన్నుకున్నామని తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని శాలువాతో సత్కరించి మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. చినసత్యంబాబు, సహాయ కార్యదర్శి సీహెచ్ రమేష్, ఉపాధ్యక్షుడు డి.జయనరసింహారావు, ప్రాంతీయ కార్యదర్శి సీహెచ్ రవికిషోర్, జిల్లా గ్రామీణాభివృద్ధి కమిటీ చైర్మన్ ఎ.రంగారావు, యువజన కార్యవర్గ సభ్యులు జూలూరు విశ్వనాథం, వేములపల్లి వెంకటరత్నం, ఎ.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కేఆర్‌ఎల్ సేవలు స్ఫూర్తిదాయకం



నరసింహారావు సంస్మరణ సభలో ప్రభుత్వ మాజీ విప్ ఉదయభాను తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: గెంటేల శకుంతలమ్మ(ఎస్‌జీఎస్) కళాశాలలో విద్యార్థులకు ఆంగ్ల భాష పరిజ్ఞానాన్ని అందజేసిన కేఆర్‌ఎల్ నరసింహారావు సేవలు స్ఫూర్తిదాయకమని వక్తలు కొనియాడారు. ఆదివారం స్థానిక ఎస్‌జీఎస్ కళాశాలలోని యూజీసీ బ్లాక్‌లో ఎస్‌జీఎస్ కళాశాలలో రిటైర్డ్ ఇంగ్లిష్ అధ్యాపకులు కేఆర్‌ఎల్ నరసింహారావు సంస్మరణ సభ సంస్కృతాంధ్రోపాన్యాసకుడు డాక్టర్ వడ్డేపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), ప్రభుత్వ మాజీ విప్ సామినేని ఉదయభాను, మాజీ మంత్రి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం శ్రీరఘురామ్ తదితరులు పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సభలో ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ నరసింహారావు సేవలు కొనియాడారు. ఉదయభాను మాట్లాడుతూ ఎస్‌జీఎస్ కళాశాలలో ఇంగ్లిష్ అధ్యాపకునిగా ఉంటూ ఎంతో మంది విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్‌ను అందించారన్నారు. నరసింహారావు సహచరోద్యోగులు, మాజీ ప్రిన్సిపాల్స్ కేఎస్ఆర్, ఈశ్వరయ్యశెట్టి, ఎస్‌వీవీ సత్యనారాయణ, జీడీవీ ప్రసాద్, అబ్బాస్‌అలీ, హసీమ్, రాజమండ్రి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పిరాట్ల శ్రీశైలశాస్త్రి తదితరులు పాల్గొన్నారు. సుశర్మ సంపాదకత్వం వహించిన కేఆర్‌ఎల్‌ఎన్ సంస్మరణ సంచికను కేఆర్‌ఎల్‌ఎన్ సతీమణి విజయలక్ష్మి ఆవిష్కరించారు.

శ్రీ కృష్ణునికి నృత్యనీరాజనం

విజయవాడ కల్చరల్: దృశ్యవేదిక ఆధ్వర్యంలో శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన నృత్య కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నాట్యాచారిణి గోనుగుంట శైలజ ఆధ్వర్యంలో శ్రీ కృష్ణ కళానిలయం బృంద సభ్యులు సత్యనందిని, కావ్య, హేమస్వి, లావణ్య, ఆసిక, శైలజ, కాత్యాయని, రాస్య, హసిత, ఖ్యాతి గణపతి నృత్యం, తరంగం, నారాయణీయం, కృష్ణ, కృష్ణ జయ అంశాలకు నృత్యాలను అభినయించారు.

తిరుపతమ్మ సన్నిధిలో భక్తుల సందడి



తిరుపతమ్మ దర్శనానికి పాల పొంగళ్లతో వస్తున్న భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పెనుగంచిప్రోలు: గ్రామంలోని శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. శ్రావణమాసం సెలవు దినం కావడం, పాటు పలు శుభకార్యాలు ఉండటంతో వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. దీంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిశాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు మధ్యాహ్న సమయంతో మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు.



మూడడుగుల ఎత్తులో ఆకట్టుకుంటున్న గణనాథులు




చిల్లకల్లులో విక్రయానికి సిద్ధంగా ఉన్న గణనాథులు

సిద్ధమవుతున్న గణనాథులు



ఈ ఏడాది ఆకట్టుకుంటున్న చిల్లకల్లులోని సరస్వతీ దేవి అలంకారంలో వినాయకుడు



తుది మెరుగులు దిద్దుతున్న కార్మికుడు

జగ్గయ్యపేట: వినాయక చవితికి గణనాథులు సిద్ధమవుతున్నారు. కొన్నిచోట్ల విగ్రహాలకు ముస్తాబు చేస్తుండగా.. మరికొన్నిచోట్ల సిద్ధమవుతున్నాయి. రాజస్తాన్, మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన విగ్రహ తయారీదారులు కొన్ని నెలలుగా షెడ్లు వేసి విగ్రహాలు తయారు చేస్తున్నారు. ఈ ప్రాంతానికి చెందిన కొందరు వ్యాపారులు కూడా హైదరాబాద్, బెంగళూరు ప్రాంతాల నుంచి ప్రత్యేకంగా విగ్రహాలను విక్రయించేందుకు ఏర్పాట్లు చేశారు. సెప్టెంబరు ఏడో తేదీ పండుగ కావడంతో వందల సంఖ్యలో విగ్రహాలను ముస్తాబు చేస్తున్నారు. విగ్రహాలు రెండు నుంచి 12 అడుగుల వరకు పలు ఆకృతుల్లో తయారు చేస్తున్నారు. శివపార్వతులు, లక్ష్మీదేవి, ఎలుకపై ఉండే ఆకారాల్లోని విగ్రహాలను అమ్మకానికి రెడీ చేశారు. ఈ ఏడాది కొత్తగా రామమందిరంపై గణనాథుని విగ్రహం, సరస్వతీదేవి ఆకారంలోని విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి. ఒక్కో విగ్రహం సైజును బట్టి మూడు నుంచి రూ. 40 వేల వరకు ధర పలుకుతున్నాయి. గ్రామాల్లో వినాయక చవితి వేడుకలకు ఇప్పటి నుంచే నిర్వాహకులు ఏర్పాట్లు చేయటంతో పాటు విగ్రహాలను కూడా ముందస్తుగా బుక్ చేసుకుంటున్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాల కొనుగోలు కేంద్రాలకు 60 శాతంపైన విగ్రహాలకు అడ్వాన్స్ ఇచ్చి బుక్ చేసుకుంటున్నట్లు వ్యాపారులు అంటున్నారు.

ఆందోళనలో పెసర, మినుము రైతులు

- ఆకాశం మేఘావృతం కావడంతో పంట కోతకు ముమ్మర యత్నాలు
- కంటితుడుపుగా మద్దతు ధర ప్రకటన
- కనిపించని కొనుగోలు కేంద్రాలు



మండలంలోని జుజ్జూరులో యంత్రం సాయంతో పెసర పంటను కోయిస్తున్న రైతు

వీరులపాడు: ఆకాశం మేఘావృతం కావడంతో పెసర, మినుము రైతులు ఆందోళన చెందుతున్నారు. వీరులపాడు మండలంలో ఈ ఏడాది 634 హెక్టార్లలో రైతులు పెసర సాగు, 59 హెక్టార్లలో మినుము సాగు చేపట్టారు. పంట కాపు దశలో వర్షాలు కురవటంతో పూత రాలిపోవడంతో పంట నష్టపోయామని అడపాదడపా ఉన్న పంటల్లో కూడా దిగుబడి గణనీయంగా తగ్గిందని రైతులు పేర్కొంటున్నారు. పంట నేల రాలడంతో కూలీ ఖర్చులు సైతం తట్టుకోలేక యంత్రాలను ఉపయోగించి రైతులు పంట కోతలు చేపట్టారు. ఈ ఏడాది పంట దిగుబడులు లేకపోవడానికి తోడు ప్రభుత్వం కంటితుడుపు చర్యగా మద్దతు ధర ప్రకటించింది. దీనికి తోడు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు.

కనిపించని కొనుగోలు కేంద్రాలు..

గత ప్రభుత్వ హయాంలో పంట కోతలు ప్రారంభ సమయంలోనే మద్దతు ధర ప్రకటించడంతో పాటు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి అన్ని రకాలుగా అండగా నిలిచిందని రైతులు అంటున్నారు. ఈ ఏడాది పంట కోతలు ప్రారంభమైనా ప్రభుత్వం నేటికీ కొనుగోలు కేంద్రాల ప్రకటన కూడా చేయలేదని రైతులు వాపోతున్నారు. గతేడాది పెసరకు క్వింటాకు రూ. 8,558 మద్దతు ధర ప్రకటించగా ఈ ఏడాది రూ. 8,682 ప్రకటించింది. మినుము పంటకు గతేడాది రూ. 7,400 ఉండగా ఈ ఏడాది రూ. 6,950 ధర ప్రకటించింది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో దళారులను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొందని దళారులు అయినకాడికి తక్కువ ధరకు అడుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నష్ట పోతారనే ఆందోళనలో..

ఆకాశం మేఘావృతంగా ఉండటంతో వర్షాలు పడి పంట నష్ట పోవాల్సి వస్తుందనే ఆందోళనతో పెసర, మినుము రైతులు పంట కోసేందుకు ముమ్మర యత్నాలు చేస్తున్నారు. యంత్రాలను వినియోగించి పంట కోతలకు శ్రీకారం చుట్టారు. ఇదే ఆసరాగా చేసుకున్న యంత్రాల నిర్వాహకులు ఎకరాకు రూ. 1,500 నుంచి 1,700 వరకు వసూలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఎకరాకు రూ. ఎనిమిది వేల నుంచి 10 వేల వరకు పెట్టుబడి పెట్టి సాగు చేసినా ఎకరాకు రెండు నుంచి మూడు క్వింటాళ్ల దిగుబడి కూడా వచ్చేలా లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బ్యాంకులు రుణాలు ఇవ్వకపోవడంతో పాటు ప్రభుత్వం కనీసం రైతు భరోసా నగదు కూడా అందించకపోవడంతో ప్రైవేట్ వ్యాపారుల వద్ద అధిక వడ్డీకి తీసుకువచ్చి సాగు చేశామని చెబుతున్నారు. గిట్టుబాటు ధర కల్పించకుంటే పెట్టిన పెట్టుబడులు కూడా రావని వారు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మినుము, పెసర రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే కఠిన చర్యలు



హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న సీఐ చంద్రశేఖర్

ఇబ్రహీంపట్నం: వాహన చోదకులు హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవని సీఐ చంద్రశేఖర్ అన్నారు. ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్‌లో హెల్మెట్ వినియోగంపై ఆదివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వాహనదారులకు హెల్మెట్ వినియోగంపై కౌన్సెలింగ్ ఇచ్చారు. మొదటిసారిగా అవగాహన కల్పించి కొద్దిపాటి జరిమానా విధించారు. ప్రాణాల రక్షణ కోసం తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సీఐ సూచించారు. వాహనం నడిపే సమయంలో మన కోసం మన కుటుంబ సభ్యులు ఎదురు చూస్తారనే ధ్యాస కలిగి ఉండాలన్నారు. ఎస్‌లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.